

## హాస్టల్ విద్యార్థులకు పరీక్షల కిట్లు పంపిణీ

**కడప అర్బన్ :** పదో తరగతి చదువుతున్న సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు పోతురాజు ఛారిటబుల్ ట్రస్ట్ వారు పరీక్షల కిట్లను పంపిణీ చేశారు. ఆదివారం పోతురాజు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పోతురాజు నారాయణమ్మ రెండో వర్ధంతిని పురస్కరించుకుని సిద్ధవటంలోని ఎస్సి, ఎస్టి సంక్షేమ గృహాల్లోని పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమయ్యే వస్తువులను అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు పుట్టపర్తి జిల్లా బుక్కపట్నం తహాశీల్దార్ భారతి, సుభాష్ బాబు, పురుషోత్తం, లోకేష్, భారతి,నరసింహ బాబు,వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడారు. దళిత బహుజన విద్యార్థులు దాతలు అందించిన సహకారంతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. రేపటి తరం విద్యార్థులకోసం ఆదర్శంగా నిలిచి అంబేద్కర్ ఆశయ సాధనలో పాలుపంచుకోవాలన్నారు. బడుగు, బలహీన వర్గాలకు డాక్టర్ బాబాసాహెబ్ ఎన్నో మార్గాలు చూపించారన్నారు. ఆ దిశగా హక్కులు సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోతురాజు కుటుంబ సభ్యులతో పాటు మాల ఐక్యవేదిక, అంబేద్కర్ యువజన సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు

### జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి

**ప్రజాశక్తి-వల్లూరు**

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలను చేరుకుంటామని సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదిఆవరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలిక పాఠశాలను ఆయన తోపాటు జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి విజయలక్ష్మి సందర్శించారు. విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన మోటివేషనల్ క్లాసెస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నేటి ఓటమిని రేపటి విజయానికి నాందిగా భావించి సమాజంలో ఎదురయ్యే సమస్యలను అవమానాలను పాజిటివ్ దృక్పథంతో ఎదుర్కొని ఉన్నత లక్ష్యం తోటి లక్ష సాధన కోసం కృషి చేసినప్పుడు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని చెప్పారు. అందుకు ప్రతి విద్యార్థీ ఒక నిర్దేశిత లక్ష్యం పెట్టుకుని లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత శిఖరాల కోసం ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదల, కృషి తపన ఉంటే సాధించలేనిది ఏది లేదని చెప్పారు. వ్యక్తిత్వాన్ని, మనస్తత్వాన్ని పెంపొందిం చుకోవాలన్నారు. పేదరికంలో పుట్టడం తప్పు కాదని పేదరికంతో చనిపోవడం తప్పని, మన భవిష్యత్తు మన చేతిలోనే ఉంటుందని అందుకు ప్రతి విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత స్థానం కోసం ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు నిజజీవితంలో చదువుతోపాటు సంస్కారం, జ్ఞానంతో పాటు లోకజ్ఞానం ముఖ్యమని చెప్పారు. జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి మాట్లాడుతూ అమ్మాయిలు భవిష్యత్తులో ఉన్నత శిఖలు చేరుకోవడానికి చదువు సంస్కారం ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి చదువుకొని భవిష్యత్తులో మహిళా సాధికారత సాధించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం ప్రధానోపాధ్యాయులు నాజిమున్నిస్సా, ఉపాధ్యాయులు లక్ష్మీదేవి విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

# చేనేత సంక్షేమానికి కృషి

- త్వరలో మైలవరం టెక్స్‌టైల్స్ పార్క్ పూర్తి
- రా మెటీరియల్ స్కీమ్ ద్వారా యార్న్ సబ్సిడీ
- మాధవరం క్లస్టర్‌లో డిజైన్స్ స్టూడియో ఏర్పాటు
- చేనేత, జౌళిశాఖ జిల్లా అడిషనల్ డైరెక్టర్ జి.నాగరాజారావు

**ప్రజాశక్తి - కడపప్రతినిధి**



ముఖా ముఖి..

**చేనేత సంక్షేమానికి ఆదరణ లభిస్తోంది. నేతన్ననేస్తం, చేనేత పింఛన్లు, ధారం, పోగు ధరల నియంత్రణపై దృష్టి సారించాం. దీంతో పాటు మూతబడిన మైలవరం టెక్స్‌టైల్ పార్కు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం ముమ్మరంగా సాగుతోంది. దీంతోపాటు మాధవరం క్లస్టర్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడమైంది. ఫలితంగా వేలాది మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది. దీంతోపాటు మాధవరం, దూఫియాన్ దుస్తులకు అంతర్జాతీయ గుర్తింపు తేవడానికి కసరత్తు చేస్తున్నాం. చేనేతల సంక్షేమంలో భాగంగా మోరగుడి క్లస్టర్‌లో అత్యాధునిక డిజైన్లలో శిక్షణను వేగవంతం చేయడమైంది. జిల్లాలోని కడప, పులివెందుల శిల్పారామాల్లో ఆప్కో షోరూమ్‌లను ఏర్పాటుకు అనుమతులు లభించాయని పేర్కొంటున్న జిల్లా చేనేత జౌళిశాఖ అడిషనల్ డైరెక్టర్ జి.నాగరాజారావుతో ముఖాముఖి....**

**టెక్స్‌టైల్ పార్కు ఎప్పుడు అందుబాటులోకి రానుంది?**

మైలవరం టెక్స్‌టైల్ పార్కు పునరుద్ధరణ వేగవంతమైంది. కలెక్టర్, చేనేత జౌళీశాఖ కమిషనర్ సహకారంతో రూ.1.14 కోట్లతో టెక్స్‌టైల్ పార్కు పనులను చేట్టాం. పనుల కేటగిరీలను బట్టి ఆయా ఎలక్ట్రిసిటీ, ఎపి ఎస్‌పిడిసిఎల్, ఆర్‌డబ్ల్యుఎస్‌లకు అప్పగించడమైంది. ఇందులో రూ.50 లక్షలతో సివిల్ పనులు, రూ.44 లక్షలతో పవర్ రెస్టోరేషన్, రూ.20 లక్షలతో తాగునీటి సదుపాయం, డ్రెయినేజీ వ్యవస్థలను మూడు నెలల్లో అందుబాటులో తేవాలనే ఉద్దేశంతో కృషి చేస్తున్నాం. దీంతో పాటు మాధవరం క్లస్టర్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడమైంది. దీన్ని డిజైన్ స్టూడియోగా అభివృద్ధి పరచాలనే ఆలోచనల్లో ఉన్నాం.

**పార్కు పునరుద్ధరణతో సామాన్యులకు మేలెంత?**

సుమారు మూడు వేల మంది సామాన్య చేనేతలకు ఉపాధి లభించనుంది. పార్కులోని 118 ప్లాట్లలో ఏర్పాటు చేయనున్న పవర్ లూమ్స్, హాండ్లూమ్స్‌తోపాటు పలు గార్మెంట్ యూనిట్స్ డెయిరీ యూనిట్స్ నిర్వహణకు నిర్వహణకు సామాన్య చేనేతల అవసరం ఉంటుందని భావిస్తున్నాం.

**చేనేత సంక్షేమం గురించి వివరించండి?**

9,500 మందికి చేనేత పింఛన్ దారులకు నెలకు రూ. 3,000 చొప్పున రూ.2.70 కోట్ల పంపిణీ చేయడమైంది. దీంతోపాటు జిల్లాలోని 9, 300 మందికి నేతన్ననేస్తం కింద ప్రతి లబ్ధిదారునికి రూ.24 వేల చొప్పున రూ. 22.32 కోట్లు పంపిణీ చేయడం జరిగింది. దీంతోపాటు పలువురు గుర్తింపు కార్డుల దగ్గర నుంచి ఇతర సంక్షేమ పథకాల ద్వారా గరిష్ట ప్రయోజనం లభిస్తోంది.

**చేనేత క్లస్టర్ల వివరాలు తెలపండి?**

ఏడు క్లస్టర్లు ఉన్నాయి. ఆరు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఉప్పరపల్లి, మైదుకూరు, మైదుకూరు బ్లాక్ లెవల్ క్లస్టర్, తిరుమల క్లస్టర్, శివాలయం క్లస్టర్, మోరగుడి, శ్రీనివాసా క్లస్టర్లు ఉన్నాయి. 2016-17లో క్లస్టర్లను ఏర్పాటు చేయడమైంది. ట్రైనీ కాంపౌండ్ కింద ఆధునిక డిజైనింగ్స్‌లో శిక్షణను ఇవ్వడమైంది. సుమారు 389 మందికి మగ్గం పరికరాలను పంపిణీ చేయడానికి కసరత్తు ఊపందుకుంది.

**డిజైనింగ్ తరగతులపై స్పందించండి?**

మోరగుడి క్లస్టర్‌లో ఆధునిక డిజైనింగ్‌లో శిక్షణా కార్యక్రమాలు చేపట్టడమైంది. సమర్థ ప్రోగ్రామ్ కింద 20 మందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడమైంది. 99 శాతం హాజరు శాతం కలిగి ఉంటేనే సర్టిఫికెట్స్ ప్రదానం చేస్తాం. శిక్షణ పొందిన చేనేత కార్మికులు సృజనాత్మక ఉత్పత్తులకు శ్రీకారం చుట్టనున్నారు. ఫలితంగా వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు లభిం చే అవకాశం ఉంది.

**గుర్తింపుకార్డుల వివరాలు తెలపండి?**

అర్హులైన చేనేతలకు మంజూరు చేశాం. ఇటీవలే 150 గుర్తింపు కార్డులను పంపిణీ చేశాం. పెన్షన్ మంజూరుకు రెండేళ్లపాటు వేజ్ పేమెంట్స్ లావాదేవీలు చేసి ఉండాలి. దీనికితోడు సహకార రంగంలో ఏడాది పాటు నేసినట్లు అనుభవం ఉండాలి. రూ.10 వేల మేరకు సిల్క్, యార్న్ బండిల్స్ చొప్పున నెలవారీగా కొనుగోలు చేసి ఉండాలి. దీనికి సిజిఎస్‌టి, ఎస్‌జిఎస్‌టి బిల్లులు కలిగిన వారికి మాత్రమే పెన్షన్ సదుపాయం వర్తించనుంది. చేనేతలకు ఆన్‌లైన్ చేయడం కుదరదని, కలెక్టర్‌కు వివరించ డంతో కలెక్టర్ స్పందించి లేఖ రాయడం జరిగింది. ఎస్ఒపి రిలాక్సేషన్ ఇచ్చే ప్రయత్నం చేయడమైంది. దీంతో ఐటి యాక్ట్ ప్రకారం రెండున్నర లక్షల లోపు లావాదేవీలకు ఎటువంటి రిజిస్టర్స్ మెయింటెనెన్స్ చేయాల్సిన అవసరం లేదు.

**జిల్లా ఉత్పత్తుల ప్రత్యేకతలను వివరించండి?**

జిల్లా చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చే ప్రయత్నాలను వేగవంతం చేశాం. ఇందులో ప్రధానంగా మాధవరం సిల్క్ చీరలను, ప్రొద్దుటూరు పరిసర ప్రాంతాల్లోని దూఫియాన్ సిల్క్ ఉత్పత్తులకు జియోగ్రాఫిక్ ఐడెంటిఫికేషన్ తెచ్చే ప్రయత్నాలను వేగవంతం చేశాం. ఈమేరకు దరఖాస్తులను అప్‌లోడ్ చేసే ప్రయత్నాల్లో నిమగ్నం కావడమైంది. ఈనెల 26న 2024 భారత్ టెక్స్ కింద ఎపి పెవిలియన్ కేటాయించడమైంది. దీనికి ప్రొద్దుటూరు నుంచి ఇద్దరు ప్రొడ్యూసర్స్‌ను, పులివెందుల ఆధిత్యబిర్లా గ్రూపు నుంచి ప్రతినిధులను పంపించే ప్రయత్నం చేయడం జరుగుతోంది.

**యార్న్ ధరల నియంత్రణ చర్యలేవీ?**

చేనేత ముడిసరుకుల ధరల నియంత్రణపై దృష్టి సారించాం. రీ రా మెటీరియల్ సరఫరా స్కీమ్ కింద చేనేతల ముడి సరుకులైన ధారం, పోగు, రంగుల ధరలపై 15 శాతం సబ్సిడీ లభిస్తుంది. వీవర్స్ సర్వీస్ సొసైటీ సెంటర్స్ రిజిస్ట్రేషన్ మెటీరియల్‌పై జిఎస్‌టి తగ్గిస్తే మరింత ప్రయోజనం లభించే అవకాశం ఉంది.

# యూనియన్ నుంచి భాగ్యమ్మ, లక్ష్మీదేవి బహిష్కరణ

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

జమ్మలమడుగు అంగన్వాడీ ప్రాజెక్టు నాయకులు భాగ్యమ్మ, లక్ష్మీదేవిని క్రమశిక్షణా చర్యల్లో భాగంగా వారిని సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్లు అంగన్వాడీ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లక్ష్మీదేవి, బి.లక్ష్మీదేవి సంయుక్తంగా ప్రకటించారు. స్థానిక ఆర్అండ్‌బి కార్యాలయంలో ఆదివారం జిల్లా కమిటీ అంగన్వాడీ ప్రాజెక్టు నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో సిఐటియులో పనిచేసిన ఎస్.లక్ష్మీనారాయణ అనే వ్యక్తి అనైతిక కార్యక్రమాలకు, అవినీతికి, బ్లాక్‌మెయిల్, ఉద్యోగాలు, ప్రమోషన్ ఇప్పిస్తానని ప్రలోభాలకు గురిచేసి డబ్బులు వసూలు పాల్పడడంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆ మేరకు అతనిపై ఐపిసి 420, 509 కింద కేసు నమోదైందన్నారు. దీంతో ఆ వ్యక్తిని సిఐటియు జిల్లా కమిటీ బహిష్కరిం చిందని వారు గుర్తు చేశారు. బహిష్కరణకు గురైన ఎస్.లక్ష్మీనారాయణతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకొని సంఘ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నందున, సంఘ సభ్యులకు తప్పుడు సమాచారం ఇస్తూ పక్కదారి పట్టిస్తున్నందున భాగ్యమ్మ, లక్ష్మీదేవిని స్థానిక అంగన్వాడీ యూనియన్ కార్యకర్తల ఫిర్యాదుల మేరకు విచారించామన్నారు. నివేదికను రాష్ట్ర కమిటీకి తెలియజేశామన్నారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు యూనియన్ జిల్లా కమిటీ గతంలో అనేక పర్యాయాలు సంఘ వ్యతిరేక కార్యక్రమాలు విడనాడాలని వారిని హెచ్చరించినప్పటికీ మార్పు రాలేదన్నారు. సంఘం సభ్యుల ఉమ్మడి ప్రయోజనాల కన్నా.. బహిష్కరణకు గురైన వ్యక్తిపైనే సానుకూలత చూపుతుండడంతో యూనియన్ నాయ కురాళ్లుగా కొనసాగుతున్న భాగ్యమ్మ, లక్ష్మీదేవిని జిల్లా కమిటీ నిర్ణయం మేరకు బహిష్కరించినట్లు తెలిపారు. నూతన నాయకత్వాన్ని త్వరలోనే ఎంపిక చేసుకుంటారని ప్రకటించారు. సమావేశంలో సిఐటియు జమ్మల మడుగు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వినయ్, విజయ్, దాసు, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శివకుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కోచ్, సెక్రటరీ

## ఓపెన్ చెస్ టోర్నీలో విజేతగా ప్రభుదేవా

**ప్రజాశక్తి-కడప**

జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరం మస్తాన్ వల్లి వీధిలోని హాల్ ఆఫ్ చెస్ లో నిర్వహించిన మూడవ వైఎస్ఆర్‌డిసిఎ ఓపెన్ చెస్ట్ టోర్నమెంట్‌లో విజేతగా కడప నగరానికి చెందిన రేటెడ్ చెస్ క్రీడాకారుడు ప్రభుదేవా నిలిచాడు. మొత్తం 52 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఐదు రౌండ్లకు 5 పాయింట్లు సాధించిన ప్రభుదేవా విజేతగా నిలిచాడు. 4.5 పాయింట్లు సాధించి ద్వితీయ స్థానంలో ప్రొద్దుటూరుకు చెందిన సూరజ్ కుమార్ నిలిచాడు. తృతీయ స్థానంలో కడప నగరానికి చెందిన చిన్మయి నిలిచింది. తరువాతి స్థానాలలో ఉమాదేవి, జగదీష్ అనురాగ్ ప్రీతం, రెడ్డి పవన్, వినోద్, ప్రణవ్ రెడ్డి మరియు అభిరామన్ నిలిచారు. టోర్నమెంట్ లో చీఫ్ ఆర్బిటర్‌గా శ్రీకాంత్ విధులను నిర్వర్తించారు. విజేతలుగా నిలిచిన వారికి కోచ్ తబస్సు, జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ అనీస్ దర్బారి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

## అధికారంలోకి రాగానే ఎవరినీ వదలం : టిడిపి

**ప్రజాశక్తి కడప అర్బన్**

నగరంలో 25వ డివిజన్‌లో తెలుగుదేశం పార్టీలో గిరి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చేరికలు కొనసాగాయి. ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి టిడిపి కడప పార్లమెంటు ఇన్‌ఛార్జి శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవి రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి హరి ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాధవిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేసుకునేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం అంజాద్ బాష దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి రాగానే ఎవరినీ వదలమని హెచ్చరించారు. తన తమ్ముడు ఇలానే మాట్లాడతాడని అంజాద్ బాష చెప్పడం సిగ్గుచేటని వాపోయారు. వైసిపి మృగాలను తరిమికొట్టేందుకు ప్రజల సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. టిడిపి కార్యకర్తలకు అండగా ఉంటామని చెప్పారు. ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా కృషి చేసే బాధ్యత తనదని చెప్పారు. తనను గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. గిరి, నవీన్, శైలజ పార్టీలో చేయడం హర్ష నియమన్నారు. భయపడేవారు ఇక్కడ ఎవరూ లేరన్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

శిల్పారామం సాంస్కృతిక కళా వేదికపై పెస్ట్‌క్రై వారి సహకారంతో నగరానికి చెందిన 'వర్షిణి' డ్యాన్స్ అకాడమి వారు ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జానపద, శాస్త్రీయ, సినీ గీతాలకు నృత్యాలు చేశారు. కార్యక్రమాలకు ఎఒ శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.


నృత్యాలు చేస్తున్న కళాకారులు

# సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకే పోటీలు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకే పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. 'రోల్ ఆఫ్ రోబోటిక్ టెక్నాలజీ ఇన్ ఫ్యూచర్ (డే టుడే లైఫ్) ఊహాజనిత చిత్రం' పై డ్రాయింగ్ పోటీలు కడప విద్యాసాగర్ ఆస్పత్రి, విద్యాసాగర్ ఆర్థరైటిస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బాలాజీ నగర్‌లో ఉన్న ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ప్రముఖ మోకాళ్ల కీళ్ల మార్పిడి నిపుణులు డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి, షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ శ్రీ లక్ష్మి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి రోబోటిక్ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. టెక్నాలజీ ప్రపంచంలో దినదినాభివృద్ధి చెందుతూ ముందుకు వెళుతుందని తెలిపారు. భారతదేశంలో కూడా టెక్నాలజీ రాబోయే రోజుల్లో ఎలాంటి పనులకు ఉపయోగించుకోవచ్చు అని విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించాలని చెప్పారు. పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.7 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు, ఒకొక్కరికి రూ. వెయ్యి చొప్పున ఐదుగురికి కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామని తెలిపారు. పోటీలకు జిల్లాలోని సుదీర్ఘ ప్రాంతాల నుంచి దాదాపు 300 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్లను ప్రదానం చేశామని, విజేతలుగా నిలిచిన వారికి త్వరలో బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.వీర సుదర్శన్ రెడ్డి, వైవీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ చిన్న రాయుడు, వీరప్ప, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ బాబు, నాయకులు కృష్ణారెడ్డి, రంగనాయకులు, వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, ఎల్లేశ్వరరావు, ఉషా తులసి, సుబ్బారెడ్డి, జెవివి నాయకులు కరీముల్లా, వివిధ పాఠశాలల విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మోకాళ్ల కీళ్ల మార్పిడి నిపుణులు డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి

# ఆలోచనాత్మక కథారచయిత డాక్టర్ వేంపల్లె షరీఫ్

### - తెలుగు అధ్యాపకులు డాక్టర్ నాగరాజు

**ప్రజాశక్తి- కడప అర్బన్**

ఆలోచనాత్మక కథారచయిత డాక్టర్ వేంపల్లె షరీఫ్ అని, రాయలసీమ జనజీవన స్థితిగతులను, ముస్లిం జీవితాలను, ముస్లింవాదాన్ని తన కథల్లో ఆలోచనాత్మకంగా చిత్రీస్తూనే మానవతావాదానికి చాలా ప్రాధాన్యమిచ్చారని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ పొదిలి నాగరాజు పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 129వ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో 'డాక్టర్ వేంపల్లె షరీఫ్ జీవితం – సాహిత్యం' అనే అంశంపై కడప ప్రభుత్వ పురుషుల కళాశాల తెలుగు అధ్యాపకులు ప్రసంగించారు. వేంపల్లె షరీఫ్ అసలు పేరు షేక్. మహమ్మద్ షరీఫ్ అని, వేంపల్లెలో పుట్టిన ఆయన ఊరిపై ఉన్న మమకారంతో ఊరిపేరును ఇంటి పేరు (కలంపేరు)గా మార్చుకుని వేంపల్లె షరీఫ్‌గా కొనసాగుతున్నారన్నారు. షరీఫ్ రచనల్లో సమకాలీన సమాజంలో జరిగే అనేక సంఘటనలు సుస్పష్టమవుతాయని తెలిపారు. షరీఫ్ కలం నుంచి జుమ్మా, టోపి జబ్బార్, చారలపిల్లి అనే కథాసంపుటాలు, 'తియ్యని చదువు' అనే బాలల కథాసంపుటి వెలువడ్డాయన్నారు. జర్నలిజంలో పిహెచ్‌డి చేసి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి పట్టా పొందారని, 'టీవీ ప్రకటనల్లో సంస్కృతి' పేరుతో ఇటీవలే తన పరిశోధనను పుస్తకంగా ప్రచురించారన్నారు. డాక్టర్ వేంపల్లె షరీఫ్ తన స్పందనను తెలియజేస్తూ తనపై నెలనెలా సీమ సాహిత్యంలో ప్రసంగం ఏర్పాటు చేయడం, విశ్వవిద్యాలయంలో తన రచనలపై పరిశోధన జరుగుతుండడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వక్త డాక్టర్ పొదిలి నాగరాజును, కథారచయిత డాక్టర్ వేంపల్లె షరీఫ్‌ను సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథపాలకులు జి.హరిభూషణ రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ కలసి సత్కరించారు. కార్యక్రమంలో బ్రౌన్ గ్రంథాలయం జూనియర్ అసిస్టెంట్ ఎం.మౌనిక, కొత్తపల్లి రామాంజనేయులు, ఉర్దూ రచయితలు సత్తార్ ఫైజి, మగ్బూల్ అహమ్మద్, యోగివేమన విశ్వవిద్యాలయం ఉర్దూ విభాగం అధ్యాపకులు డాక్టర్ ఖాజాపీర్, మహమూద్ అలీ, ఖాలిద్ హుస్సేన్‌ఖాన్, దాదాఖలందర్, ఎస్. నాగముని మధుబాబు, సాయిబాబా, జగదీశ్వరి, శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు.



డాక్టర్ నాగరాజును సన్మానిస్తున్న అతిథులు



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు

## క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

**ప్రజాశక్తి-పోరుమామిళ్ల**

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవరచుకున్నపుడు ఉన్నత స్థాయికీ ఎదుగుతారని కళాశాల డైరెక్టర్ పుల్లప నాయుడు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్‌డే వేడుకలు కళాశాల ప్రిన్సిపల్ బాలవెంకట రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాల్యదశ నుంచి అనేక దశలలో అనేక అనుభవాలను గడుస్తారని చెప్పారు. కళాశాల స్థాయిలో మంచి స్నేహితులను పెంపొందించుకొని ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**కడప అర్బన్ :** ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా అన్నారు. ఆదివారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా రాయల్ రషీద్ అసోసియేషన్ ముదిరించిన ట్రాఫిక్ నిబంధనల కరపత్రాలను యుటిఎఫ్ భవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, వెంకటేశ్వరరావు, యల్లేశ్వరరావు, పవన్ కళ్యాణ్, చిన్న రాయుడు పాల్గొన్నారు.

## చెలరేగిన వంశీకృష్ణ

### - ఒకే ఓవర్‌లో ఆరు సిక్సులు

**ప్రజాశక్తి - కడప**


110 పరుగులు చేసిన వంశీకృష్ణ

కడపలోని వైయస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో సి కె నాయుడు ట్రోఫీలో భాగంగా ఆంధ్ర, రైల్వేస్ జట్ల మధ్య ఆదివారం మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన ఆంధ్ర జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో ఆంధ్ర జట్టు 7 వికెట్ల నష్టానికి 372 పరుగులు చేసింది. ఆంధ్ర జట్టుకు చెందిన ఎం. వంశీకృష్ణ చిచ్చరపిడుగుల బ్యాటింగ్‌లో విజృంభించాడు. 64 బంతులను ఎదుర్కొని 9 బౌండరీలు, 10 సిక్సర్ల సహాయంతో 110 పరుగులు (సెంచరీ) చేశాడు. రైల్వేస్ జట్టుకు చెందిన దమన్ దీప్ సింగ్ బౌలింగ్ లో ఒక ఓవర్ లో 6 బంతులకు 6 సిక్సులు ఎం. వంశీకృష్ణ కొట్టి రికార్డ్ సృష్టించాడు. ఇది కడప వైఎస్ రాజారెడ్డి స్టేడియంలో రికార్డుగా మిగిలిపోయింది. మరో బ్యాట్స్‌మెన్ ధరణి కుమార్ నాయుడు 81(108), టీ. వంశీకృష్ణ 55(74), ఎస్. వెంకట రాహుల్ 61( నాట్ అవుట్) పరుగులు చేశారు. రైల్వే జట్టుకు చెందిన ఎండి. జైస్వాల్ 3, దమన్ దీప్ సింగ్ 2 వికెట్లు తీసుకున్నారు.


తలపడుతున్న ఆంధ్ర, రైల్వేస్ జట్లు



ప్రజలతో మాట్లాడుతున్న సిఐ ఎ.పి మస్తాన్

## ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలి

**ప్రజాశక్తి - మైదుకూరు**

త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని మైదుకూరు పట్టణ పోలీస్‌స్టేషన్ సిఐ ఎపి మస్తాన్ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లె దళితవాడలో శనివారం రాత్రి ఎన్నికల కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ.. ఎలక్షన్ కోడ్ దగ్గరలో ఉన్న సందర్భంగా ఫ్యాక్షన్ జోలికి వెళ్లకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎవరైనా ప్రశాంతతకు భంగం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవైనా సమస్యలుంటే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని సిఐ కోరారు.



బస్సుల కోసం ఇబ్బందులు పడుతూ ఎదురుచూస్తున్న ప్రయాణికులు

## సిద్ధం సభకు ఆర్‌టిసి బస్సులు.. ప్రయాణికుల ఇక్కట్లు

**ప్రజాశక్తి - మైదుకూరు**

అనంతపురం జిల్లా రాప్తాడులో సిద్ధం పేరుతో ఆదివారం జరిగిన వైసిపి సభకు ఆర్‌టిసి బస్సులు తరలి వెళ్లడంతో జిల్లా వ్యాప్తంగా ప్రయాణికులు ఇక్కట్లు పడ్డారు. అధికారం చేతిలో ఉందని అధిక సంఖ్యలో బస్సులను తరలించడం ఏంటని పలువురు ప్రయాణికులు వాపోయారు. మైదుకూరు ఆర్‌టిసి బస్టాండ్‌లో బస్సుల్లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇకనైనా ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి పార్టీ సమావేశాలు, సభలకు ఆర్‌టిసి బస్సులను ఉపయోగించుకోకుండా ప్రభుత్వం చట్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**చాపాడు :** అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం వైసిపి నిర్వహించిన సిద్ధం సభకు మండల పరిధిలోని ఆ పార్టీ కార్యకర్తలు తరలి వెళ్లారు. ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆదేశాల మేరకు ఎంపిపి టి.లక్షుమయ్య ఆధ్వర్యంలో ప్రతి గ్రామం నుండి కార్యకర్తలు వెళ్లారు. ప్రతి గ్రామానికి పార్టీ తరపున బస్సు సౌకర్యాన్ని కల్పించారు.

**లింగాల :** అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన సిద్ధం సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు మండలం నుంచి పెద్ద ఎత్తున వైసిపి నాయకులు తరలి వెళ్లారు. మండలంలోని కడప పార్లమెంటు సెక్రెటరీ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపిపి సుబ్బారెడ్డి, ఎంపిపి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో లింగాల, అంబకపల్లి, మురారి చింతల, వెలిదండ్ల, పార్నపల్లి, బోనాల, పెద్ద కుడాల గ్రామాల వైసిపి నాయకులు భారీ ఎత్తున తరలి వెళ్లారు.

## నేడు వాలంటీర్లకు 'వందనం'

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలోని వైయస్ కల్యాణ మండపంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ మహబూబ్ బీ తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాలంటీర్లకు సన్మానం ఉంటుందన్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి హాజరవుతారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు, మండలస్థాయి అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలని ఎంపిడిఒ సూచించారు.



మెయిన్ బజార్‌లో గుంపులుగా ఉన్న ఆవులు

## అధికారుల ఆదేశాలు బేఖాతర్

**యథేచ్ఛగా తిరుగుతున్న ఆవులు - పట్టని యజమానులు**

**ప్రజాశక్తి - వేంపల్లె**

రోడ్లపై తిరిగే ఆవులను వాటి యజమానులు తోలుకుపోవాలని పంచాయతీ అధికారులు ఆదేశాలిచ్చారు. వాటిని వారు బేఖాతరు చేస్తున్నారు. పట్టణంలో ఆవులు గుంపులు గుంపులుగా రోడ్లపైనే తిరుగుతూ ట్రాఫిక్ సమస్యను సృష్టిస్తున్నాయి. ఆవులు రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ఉండడంతో వాహనదారులకు చాలా ఇబ్బందిగా మారింది. గత వారం రోజుల క్రితం పంచాయతీ అధికారులు రోడ్లపై తిరిగే ఆవులను ఇంటికి తోలుకుపోయి రోడ్లపైకి విడవకుండా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులకు, పాదచారులు ఇబ్బంది కలిగేలా రోడ్లపై తిరిగే ఆవులను దూర ప్రాంతాలకు తరలిస్తామని చెప్పారు. అధికారుల ఆదేశాలను ఏ ఒక్క ఆవు యాజమాని కూడా పట్టించుకోలేదు. ఆవులు వీధుల్లో, రోడ్లపై తిరుగుతూనే ఉన్నాయి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా రోడ్లపై ఆవులు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురై ఆస్పత్రి పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై తిరుగుతున్న ఆవులను వెంటనే దూర ప్రాంతాలకు తరలించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

## సమీకృత వసతి గృహం.. పచ్చదనానికి నిలయం

**ప్రజాశక్తి - ఖాజీపేట**

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు.. మొక్కలు నాటండి పర్యావరణాన్ని పరిరక్షించండి.. ఇంటింటా చెట్లు ఊరురా వనం. ఈ మాటలను నిజం చేస్తున్నారు ప్రభుత్వ వసతి గృహ అధికారులు. సుంకేసుల రోడ్డులోని సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలుర సమీకృత వసతి గృహం పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణంలో దర్శనమిస్తుంది. వసతి గృహ ఆవరణంతా రకరకాల చెట్లతో ఆహ్లాదాన్నిస్తోంది. వార్డెన్లు బాబు, పట్టాభి సీతారామరాజు ప్రత్యేకశ్రద్ధ కనబరుస్తూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నారు. ప్రతి రోజు సాయంత్రం విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో స్టడీ అవర్స్ నిర్వహిస్తూ ఇంటి వాతావరణాన్ని తలపించేలా శ్రద్ధ కనబరుస్తున్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు ఎనలేని కృషి చేస్తున్నారు. హాస్టల్ ఆవరణ రకరకాల చెట్లతో ఏపుగా పెరిగి ఉండడం వల్ల చల్లదనంతో పాటు విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కలుగుతోంది.



# సిరులు కురిపిస్తున్న పుచ్చకాయ పంట

**-90 రోజుల్లోనే పంటచేతికి - పెట్టుబడి తక్కువ - రూ.2లక్షల వరకు ఆదాయం**

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

రైతులకు పుచ్చకాయ (వాటర్ మిలాన్) పంట సిరులు కురిపిస్తోంది. 90 రోజుల్లోనే పంట చేతికి రావడం వల్ల మంచి లాభాలు వస్తున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నల్లగా నిగనిగలాడే పుచ్చకాయలు ఆరోగ్యానికి మంచివి అంటారు. ఎర్రటి రంగు కలిగి నల్లటి గింజలతో చూడగానే నోరూరించే పుచ్చపండు అంటే ఇష్టపడని వారు ఎవరూ ఉండరు. వేసవి వచ్చిందటే దీనికి ఉండే డిమాండే వేరు. సామాన్యులు సైతం కొనుక్కోగలిగే ధరల్లో ఇవి మనకు లభిస్తాయి. వేసవికాలం వచ్చిందంటే చాలు ప్రజలు తమ దాహం తీర్చుకోవడానికి పలు రకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అందులో భాగంగానే మనకు కాలానుగుణంగా వచ్చే పుచ్చకాయలు వేసవికాలంలో చాలానే దొరుకుతాయి. ఈ పంటను పండించడానికి 90 రోజుల గడువు తీసుకుని మార్కెట్లోకి వస్తాయి. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను గడిస్తారు. లింగాల మండలంలో అత్యధికంగా సాగు చేశారు. ఈ పంటకు తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభాలను పొందుతూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. మొత్తం 90 రోజుల వ్యవధిలోనే చేతికి వచ్చి లాభాలను ఇస్తుందని.. దీంతో తమకు చేతి నిం



డా పనిదొరుకుతున్నదన్నారు. ఎకరాకు విత్తనాలకు రూ.20 వేలు ఖర్చు కాగా, మరో రూ.20వేలు మందులకు, కూలీలకు కలిపి మొత్తం రూ.60వేలు ఖర్చు పెట్టి పంట తీస్తారు. కానీ పంట చేతికి వచ్చినప్పటినుంచి మూడు సార్లు తెంపుతారు(కోత). వాటితో రాబడి మొత్తం దాదాపుగా రూ.2లక్షల దాకా వస్తుంది.

**లాభాలు బాగా వస్తున్నాయి..**

నేను పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నా. మాకు ఉన్న పొలంలో మూడు ఎకరాలు ప్రస్తుతం పుచ్చకాయ పంట వేశాను. ఈ విత్తనం వేసిన దగ్గర నుంచి పంట చేతికి వచ్చే వరకు కూడా చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. నేను మాత్రం వీటి ద్వారా అధిక లాభాలనే పొందుతున్నాను. రూ.12 నుంచి రూ.16 కిలో లెక్క అమ్ముతాము.

**- ఎర్ర మేకల ఈశ్వరుడు, రైతు**

**తక్కువ రోజుల్లో పంట చేతికి వస్తుంది**

పుచ్చకాయ పంట 90 రోజుల్లోనే చేతికి వస్తుంది. ఖర్చు చాలా తక్కువగా అవుతుంది. ఆదాయం బాగా ఉంటుంది. ఈ ఏడాది తెగుళ్ల లేకపోవడంతో పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం ధర కిలో రూ.15 ఉండడంతో మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంది.

**- వెంకటరమణారెడ్డి, రైతు**

## ఖాదరపల్లె అభివృద్ధికి కృషి : పుట్టా



టిడిపిలో చేరిన నాయకులతో పుట్టా సుధాకర్ యాదవ్

**ప్రజాశక్తి - చాపాడు**

మండలంలోని ఖాదరపల్లె గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. ఖాదర్‌పల్లె గ్రామంలో ఆదివారం వైసిపి నుంచి పుట్టా సమక్షంలో చింపతి కుటుంబ సభ్యులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పుట్టా మాట్లాడుతూ రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుండి ఖాదరపల్లె తనకు అండగా నిలుస్తోందన్నారు. గత ఎన్నికల్లో కూడా మంచి మెజార్టీ వచ్చిందన్నారు. ప్రస్తుతం గ్రామంలో పట్టు ఉన్న చింపతి కుటుంబ సభ్యులు ఉపసర్పంచ్ పోచమాబు, లాల్‌బాషా, ఫక్రువల్లి, జాకీర్ పాచా మాబు, పక్రుద్దీన్, పక్రువల్లి, బికారి, ఖాసీంవలి పార్టీలోకి రావడం శుభప్రదమన్నారు. జగన్ అరాచకాలు, నియంత పాలన చూసి టిడిపికి ఆదరణ పెరుగుతోందన్నారు. సొంత చిన్నాన్నను హత్య చేస్తే నిందితులను పట్టుకోలేని పరిస్థితుల్లో జగన్ ఉన్నారన్నారు. ప్రస్తుతం సిద్ధం పేరుతో రాష్ట్రంలో యుద్ధం తలపించేలా చేస్తున్నారన్నారు. 2019లో శంకుస్థాపన చేసిన రాజోలు ఆనకట్టకు దిక్కు లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించాలని పుట్టా కోరారు. అధికారంలోకి రాగానే ప్రతి గ్రామానికి శ్మశాన వాటికను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి మల్హోత్రా, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి వైవి సుబ్బారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి, టిడిపి నాయకులు రవిశంకర్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి మేకల బాబు, ఉమాకాంత్, మిల్లు శ్రీను, మాజీ సర్పంచ్ నాయక్, అక్బర్ సుబ్బరామిరెడ్డి, వెంకటరమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని గాడిలో పెట్టగల సమర్థుడు చంద్రబాబు



మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

అన్ని రంగాల్లో గాడి తప్పిన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టగల సమర్థుడు చంద్రబాబు అని ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం 30వ వార్డ్ నాగేంద్రనగర్‌లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. 2024లో అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో డబ్బు, మద్యం ఎంతమాత్రం ప్రభావం చూపవని తెలిపారు. చంద్రబాబు, పవన్ మాదిరి ప్రజల్లోకి వెళ్లే దమ్ము, ధైర్యం జగన్‌కు లేవన్నారు. అధికారంలోకి రాకముందు జగన్మోహనరెడ్డి పాదయాత్ర ద్వారా ప్రజలకు చాలా దగ్గరగా ఉండేవారని, అధికారం చేతికి వచ్చాక ఆయన ప్రజలకు దూరంగా ఉంటున్నారన్న విషయం అందరూ చూస్తునే ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సీతారాంరెడ్డి, భరత్ కుమార్‌రెడ్డి, కొరతాల వెంకటసుబ్బారెడ్డి, భోగాల మునీశ్వర్‌రెడ్డి, పాణ్యం సుబ్బరాయుడు, వెలవలి పద్మనాభరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసులు యాదవ్, ప్రొద్దుటూరు రూలర్ మండల కన్వీనర్ బోడెల బాబుల్‌రెడ్డి, కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరయ్య, ముదిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ఆర్కటవేముల గడ్డం సత్యంరెడ్డి పాల్గొన్నారు.

**సోషల్ మీడియా చాలా కీలకం**

**జమ్మలమడుగు రూరల్ :** పార్టీ అధికారంలోకి రావడానికి, నియోజకవర్గంలో మనం గెలవడానికి సోషల్ మీడియా చాలా కీలకమని టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో సోషల్ మీడియా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సోషల్ మీడియా పాత్ర కీలకమన్నారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా చాలా క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. అధికార పక్షం ఎలాంటి అభివృద్ధి చేయకపోయినా వారి సోషల్ మీడియాలో చేసినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ఈ దుర్మార్గపు పాలనను సోషల్ మీడియా వేదికగా ఎండగట్టి ప్రజలను చైతన్యపరచాలన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని భూపేష్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, కడప పార్లమెంటు అధ్యక్షులు గోవర్ధన్‌రెడ్డి, ఐటిడీపీ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

## మహిళల సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యం : పిసిసి



మహిళలకు నియామకపత్రాలు అందజేస్తున్న తులసిరెడ్డి

**ప్రజాశక్తి - వేంపల్లె**

మహిళల సాధికారత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళలు అందరూ కాంగ్రెస్ వైపు చూస్తున్నారని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. కడపకు చెందిన శ్యామలమ్మను రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలిగా, వేముల నాగరత్నను మహిళ కాంగ్రెస్ నగర అధ్యక్షురాలిగా, మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు తాతియాను నియమించారు. ఈ నేపథ్యంలో వేంపల్లెలో ఆదివారం పదవులు పొందిన శామలమ్మ, నాగరత్నకు తులసిరెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు రాజకీయ, సాంఘిక, ఆర్థిక సాధికారత కోసం కాంగ్రెస్ ఎంతో చేసిందన్నారు. బాలింతలకు, గర్భిణులు, బాలబాలికల్లో పౌష్టికాహార లోప నివారణ కోసం 1975లోనే అంగన్వాడీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళా ఆర్థిక స్వావలంబన కోసం డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి పావలా వడ్డీ, సున్నా వడ్డీ, స్త్రీ నిధి పథకాలను ప్రవేశ పెట్టి మహిళాలను మహారాజులుగా చేసిందని వివరించారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి లక్షలాది మంది మంది మహిళలను రాజకీయ పదవులైన సర్పంచులు, ఛైర్మన్లుగా, మేయర్లుగా చేసిందని చెప్పారు. కాంగ్రెసు ప్రభుత్వం అధికారంలోకి వస్తే బంగారుతల్లి, అమ్మ హస్తం పథకాలను పునరుద్ధరణ చేస్తామని తులసిరెడ్డి పేర్కొన్నారు. ధరలు కూడా తగ్గిస్తామన్నారు. నియామక పత్రాలు అందుకున్న మహిళలు తులసిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహరెడ్డి పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి**

**జమ్మలమడుగు రూరల్ :** రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని రాష్ట్ర కాంగ్రెస్ మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బి అథిధిగృహంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో అభివృద్ధి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే దేశానికి, రాష్ట్రానికి మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంచాల పుష్పరాజు, ఇన్‌ఛార్జి సుబ్రహ్మణ్యశర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మీడియా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ కైప జానకి రామకృష్ణ, జమ్మలమడుగు టౌన్ ప్రెసిడెంట్ పదముత్తం రాజేష్, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు భూతమాపురం సుబ్బారావు, కాంగ్రెస్ నాయకులు పాముల బ్రహ్మానందరెడ్డి, ఎస్‌సి సెల్ సంజయ్, ప్రవీణ్ రెడ్డి, వెంకటేష్, దేవదాసు, అమర్, నాయకులు పాల్గొన్నారు.

## నడిరోడ్డులో గుంత..

**ఏళ్లు గడుస్తున్నా పట్టని అధికారులు**

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

నడిరోడ్డులో గుంత రెండేళ్ల నుంచి దర్శనమిస్తున్నా అధికారుల్లో స్పందనలేదు. మండల పరిధిలోని కొత్తరోడ్డు-సున్నపురాళ్లపల్లె గ్రామం మధ్యలో కాలువపై ఒక పెద్ద గుంత 2021 వర్షాకాలంలో పడింది. నాటి నుంచి నేటి వరకు అధికారులు చూస్తూ ఉన్నాకానీ పట్టించుకొనే నాథుడు లేడని ఆ దారి వెళ్లే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారిలో సున్నపురాళ్లపల్లెతోపాటు, పవిత్ర పుణ్య క్షేత్రమైన కన్యతీర్థం, సిరిగేపల్లి, పెద్ద దండ్లూరు, థర్మల్‌కు నిత్యం ఆటోలు, ట్రక్కులు, బూడిద లారీలు, ద్విచక్ర వాహన దారులు వెళ్తూ ఉంటారు. కన్యతీర్థం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్టీల్ ప్లాంట్‌కు భూమి పూజ చేసేందుకు వచ్చే సమయంలో ఆ దారి వెంబడి ప్యాచ్ లు వేశారు కానీ, ఈ గుంతను పూడ్చి వేయకపోవడంతో గ్రామస్తులు అసహనానికి గురవుతున్నారు. గతంలో ద్విచక్ర వాహన దారులు కింద పడి కాళ్లు, చేతులు విరుచుకున్న సందర్భాలున్నాయి. ఒక బూడిద ట్యాంకు గుంతను తప్పించబోయి కాలువలోకి దూసుకెళ్లింది. ఇలా చాలా ప్రమాదాలకు నిలయంగా మారింది. స్టీల్ ప్లాంట్ వద్దకు నూతన రోడ్డును వేస్తూ ఈ దారిని అసలు పట్టించుకోవడం లేదు. నూతనంగా వేస్తున్న దారి పూర్తి కావాలంటే ఇంకా రెండేళ్లు పట్టే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో ఏర్పడిన పెద్ద గుంత



మహిళలను పలుకరిస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


## నేడు లోమడలో సీతారాముల కల్యాణమహోత్సవం

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

మండలంలోని లోమడ గ్రామంలో సోమవారం సీతారాముల, శివపార్వతుల కల్యాణమహోత్సవం నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. కార్యక్రమానికి ముందుగా ఆదివారం ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి సీతారాముల, శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీకి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, వైసిపి నాయకులు రిషికేశవరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

**నేడు బండలాగుడు పోటీలు**

సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా సోమవారం సీనియర్ కేటగిరి ఎడ్లచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.80,000 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు ప్రజలను కోరారు.



తనను గెలిపించాలని ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

## వైసిపిని గెలిపించండి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి కోరారు. ఆదివారం స్థానిక కూరగాయల మార్కెట్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి అంగడి వద్దకెళ్లి వ్యాపారుస్తులతో మాట్లాడుతూ ఇక్కడి వ్యాపారస్తుల కొనుగోలుదారుల ప్రయోజనార్థం సర్వాంగ సుందరంగా నూతన శాశ్విత కూరగాయల మార్కెట్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే అన్నారు. ఆ మర్కెట్ ప్రస్తుతం నిర్మాణదశలో ఉందని, అన్ని హంగులతో త్వరలో అందుబాటులోకి వస్తుందన్నారు. అంత వరకు తాత్కాలిక మార్కెట్ వినియోగంలో ఉంటుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు అసౌకర్యానికి గురికాకుండా అన్ని అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్యను పరిష్కరించామన్నారు. థర్మల్‌కు పోయేదారిలో బ్రిడ్జి, ఆర్టీసి బస్టాండ్ ఆధునీకరణ, వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వాసుపత్రి ఆధునీకరణ, మైదుకూరు రోడ్డు స్మార్ట్ సిటీ వంటి పలు పనులు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. త్వరలో ప్రజలకు వినియోగంలోకి వస్తాయన్నారు. ఇక సంక్షేమం విషయానికొస్తే అమ్మఒడి, వసతిదీవెన, విద్యాదీవెన, ఆసరా, చేయూత, నేతన్ననేస్తం ఇలా సమాజం నుండి పేదరికాన్ని దూరం చేసేందుకు పలు పథకాలు ముఖ్యమంత్రి జగన్ అమలు పరుస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని రాచమల్లు కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా రామాలయం మూడవ వార్షికోత్సవం

**ప్రజాశక్తి - ఖాజీపేట**

మండలం పరిధిలోని రావులపల్లి పంచాయతీ పాటిమీదపల్లె గ్రామంలో సీతారామ ఆలయ మూడవ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ లక్ష్మణ విగ్రహాలకు అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పంచాయతీ ఉప సర్పంచ్ లక్ష్మిరెడ్డి దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీవేణు గోపాలకృష్ణ స్వామి విగ్రహ ప్రతిష్టాపన

**ప్రజాశక్తి - వేంపల్లె**

మండలంలోని కుమ్మరాంపల్లె గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ వేణు గోపాలకృష్ణ స్వామి విగ్రహ ప్రతిష్టాపన ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో పలు పూజలు, హోమాలు నిర్వహించారు. వేద పండితులు సుధాకర్ శర్మ నేతృత్వంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను కుమ్మరాంపల్లెలో ఊరేగింపు చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మూడు రోజులుగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వేంపల్లె, చక్రాయపేట మండలాల భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

## మార్కెట్లోకి దోసకాయలు

**ప్రజాశక్తి - చాపాడు**

మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా దోస పంట దిగుబడి ప్రారంభమైంది. ఖరీఫ్ పంట నూర్పిడి అనంతరం విస్తారంగా దోస సాగును రైతులు చేపట్టారు. ముఖ్యంగా చాపాడు, మైదుకూరు, ఖాజీపేట మండలాల్లో దోస సాగైంది. సాధారణ రకంతోపాటు జ్యూస్ రకం దోసకాయలను అధికంగా సాగు చేశారు.



నియోజకవర్గ పరిధిలో వెయ్యి ఎకరాల వరకు దోస సాగులో ఉంది. ప్రస్తుతం పంట దిగుబడి ప్రారంభమైంది. కిలో రూ.30తో అమ్మకాలు చేప డుతు న్నారు. గుంటూరు, నెల్లూరు, తిరుపతి వంటి నగరాలకు ఎగుమతి చేస్తున్నారు.